RNI. No. TELTEL /2022/ 89348

మన వార్తలు.. మన సమాచారం.. మన విశేషాల మాగాణ.. మన..

# తెలంగాణ అవతరణ

ఆత్మ గౌరవ అక్షర సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 4 సంచిక : 155 | పెద్దపల్లి | ఎడిటర్ : పి. రామకృష్ణ | శుక్రవారం, జూన్.5, 2026 | పేజీలు : 8 | వెల : రూ. 5/-



## ఫోన్ ట్యాపింగ్ కేసు: సస్పెండెడ్ ఏఎస్పీ

# భుజంగరావు అరెస్ట్...

## రూ.100 కోట్లకు పైగా ఆస్తుల గుర్తింపు

ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు భుజంగరావు అరెస్ట్

ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన ఏసీబీ

ఏకకాలంలో 15 ప్రాంతాల్లో సోదాలు.. రూ.5.92 కోట్ల ఆస్తుల గుర్తింపు

న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలింపు



తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న సస్పెండెడ్ అదనపు ఎస్పీ నాయిని భుజంగరావును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అరెస్ట్ చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆయనను నిన్న అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో అధికారులు ఆయన్ను చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు. నిన్న ఉదయం నుంచి ఏసీబీ అధికారులు భుజంగరావుతో పాటు ఆయన బంధువులు, సన్నిహితులకు చెందిన సుమారు 15 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని హఫీజ్‌పేట, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో ఈ తనిఖీలు జరిగాయి. ఈ సోదాల్లో రూ.5.92 కోట్ల విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలను గుర్తించినట్లు ఏసీబీ అధికారులు అధికారికంగా ప్రకటించారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల్లో 27.29 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లో రెండు ఇళ్లు, ఐదు ఓపెన్ ప్లాట్లు, ఒక వాణిజ్య భవనం ఉన్నాయి.

వీటితో పాటు రూ.3.83 లక్షల నగదు, కిలో బంగారం, రెండు కార్లను కూడా గుర్తించారు. ఈ ఆస్తుల డాక్యుమెంట్ విలువ రూ.5.92 కోట్లుగా ఉన్నప్పటికీ, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.100 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భుజంగరావు ఇంట్లో 29 మద్యం సీసాలు లభించడంతో, ఆ విషయాన్ని ఎక్సైజ్ శాఖకు నివేదించినట్లు ఏసీబీ తెలిపింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖుల ఫోన్లను అక్రమంగా ట్యాపింగ్ చేశారన్న ఆరోపణలపై నమోదైన కేసులో భుజంగరావు నిందితుడిగా ఉన్నారు.

ఈ కేసులో ఆయనను 2024 మార్చిలో అరెస్ట్ చేయగా, తర్వాత తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తాజాగా అక్రమాస్తుల కేసు నమోదు కావడంతో ఏసీబీ ఆయన్ను మరోసారి అరెస్ట్ చేసింది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

# ఇరాన్ యుద్ధం సెగ..

భారత ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు కేంద్రం కీలక నిర్ణయం?

ఇరాన్ యుద్ధ ప్రభావం తగ్గించేందుకు కేంద్రం చర్యలు

ప్రభుత్వ సెక్యూరిటీలపై క్యాపిటల్ గెయిన్స్ టాక్స్ రద్దు చేసే యోచన

ఆదాయపు పన్ను చట్ట సవరణకు ఆర్డినెన్స్ తెస్తున్నట్లు సమాచారం

స్టాక్ మార్కెట్ల నుంచి రూ.2.5 లక్షల కోట్లు ఉపసంహరించుకున్న విదేశీ మదుపర్లు



**న్యూఢిల్లీ,జూన్,4:** ఇరాన్ యుద్ధం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉంది. ఈ ప్రతికూల ప్రభావాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ కీలక అడుగు వేసినట్లు తెలుస్తోంది. దేశంలోకి విదేశీ పెట్టుబడులను పెద్ద ఎత్తున ఆకర్షించడమే లక్ష్యంగా సంచలన నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఆర్డినెన్స్‌ను ఆమోదించినట్లు సమాచారం.

ఈ ఆర్డినెన్స్ ద్వారా ఆదాయపు పన్ను చట్టాన్ని సవరించనున్నారు. ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు పెట్టే పెట్టుబడులపై క్యాపిటల్ గెయిన్స్ పన్నును పూర్తిగా రద్దు చేయనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రపతి ఆమోదం లభించిన వెంటనే

ఈ కొత్త నిబంధన అమల్లోకి రానుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం విదేశీ ఇన్వెస్టర్లు 12.5 శాతం దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టీసీజీ) పన్ను చెల్లిస్తున్నారు. 12 నెలల కంటే ఎక్కువ కాలం అట్టిపెట్టుకునే బాండ్లు, లిస్టెడ్ షేర్లపై ఈ పన్ను విధిస్తారు. దీనికి తోడు ప్రభుత్వ బాండ్ల ద్వారా వచ్చే వడ్డీ ఆదాయంపై 20 శాతం విత్‌హోల్డింగ్ పన్ను కడుతున్నారు. గతంలో దీనిపై ఉన్న 5 శాతం రాయితీ రేటును 2023 లోనే కేంద్రం తొలగించింది. అయినా ఈ ఏడాది విదేశీ ఇన్వెస్టర్లు భారతీయ స్టాక్ మార్కెట్ల నుంచి ఏకంగా రూ.2.5 లక్షల కోట్లు ఉపసంహరించుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల అమ్మకాలను అడ్డుకునేందుకు పన్ను కోతలు విధించాలనే డిమాండ్లు వచ్చాయి.

దేశ విదేశీ మారక నిల్వలను మరింత బలోపేతం చేయడానికి భవిష్యత్తులో మరికొన్ని చర్యలు చేపట్టే అవకాశం ఉంది. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడానికి మరిన్ని నిర్ణయాలు తీసుకోవచ్చని అధికారిక వర్గాలు అంటున్నాయి. మూలధన లాభాలపై పన్నులను

తగ్గించడం గురించి ఇన్వెస్టర్ల అభిప్రాయాలను వినడానికి సిద్ధంగా ఉన్నామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రకటించారు. ఆమె ప్రకటన చేసిన కొద్ది రోజుల్లోనే కేంద్ర మంత్రివర్గం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు రావడం గమనార్హం.

# బోర్డు తిప్పేసిన ఐటీ కంపెనీ..

# రోడ్డున పడ్డ 700 మంది ఉద్యోగులు

**థింక్‌టెక్ ఇండియా సీఈఓ హర్షల్ ఠాక్రే అరెస్ట్**

**జనవరి నుంచి ఉద్యోగులకు జీతాల నిలిపివేత**

**లాప్‌టాప్‌ల పేరుతో డిపాజిట్లు వసూలు ఆరోపణ**

**కంపెనీ ఇచ్చిన చెక్కులు కూడా బౌన్స్**




పూణె,జూన్,4: పూణెకు చెందిన ఐటీ సంస్థ 'థింక్‌టెక్ ఇండియా' తన కార్యకలాపాలను అకస్మాత్తుగా నిలిపివేసింది. దీంతో కంపెనీలో పనిచేస్తున్న 700 మందికి పైగా ఉద్యోగులు ఒక్కసారిగా రోడ్డున పడ్డారు. ఆఫీసులకు తాళాలు వేసి ఉండటం, కంపెనీ ప్రతినిధులు అందుబాటులో లేకపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. తమకు రావలసిన బకాయి జీతాలు, సెక్యూరిటీ డిపాజిట్లు ఇప్పించాలంటూ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. ఈ పరిణామంపై పోలీసులు రంగంలోకి దిగారు. ఆర్థిక అక్రమాలు, మోసాలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల ఆధారంగా కంపెనీ సీఈఓ హర్షల్ ఠాక్రేను పోలీసులు అరెస్ట్ చేశారు.

25 ఏళ్ల వయసున్న ఇంటర్న్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు సంస్థ ఆర్థిక లావాదేవీలపై లోతైన దర్యాప్తు ప్రారంభించారు. తర్వాత మరో 30మందికి పైగా ఉద్యోగులు, ఇంటర్న్‌లు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదులు చేశారు. తమకు జీతాలు ఇవ్వలేదని, స్టైపెండ్‌లను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తమ నుంచి వసూలు చేసిన డబ్బును కూడా తిరిగి ఇవ్వలేదని బాధితులు పేర్కొన్నారు. నిజానికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఏప్రిల్‌లో ఈ కంపెనీని మూసివేసినట్లు ఉద్యోగులు తాజాగా పోలీసులకు తెలిపారు. ఎప్పటిలాగే ఆఫీసుకు వచ్చిన తమకు తాళాలు వేసి కనిపించాయని చెబుతున్నారు. కానీ, వాళ్లు ఇచ్చిన చెక్కులు బౌన్స్ కావడంతో మోసపోయామని తాజాగా గ్రహించారు. కంపెనీ ప్రతినిధులను సంప్రదించడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది.

ఈ కేసులో సీఈఓతో పాటు కంపెనీ ట్రైనింగ్ హెడ్, హెచ్ఆర్ మేనేజర్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. అధికారిక లాప్‌టాప్‌లు, ఇతర పరికరాల కోసం అంటూ ఉద్యోగులు, ఇంటర్న్‌ల నుంచి కంపెనీ సుమారు రూ.15,000 చొప్పున సెక్యూరిటీ డిపాజిట్లు వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

మొదట్లో జీతాలు, స్టైపెండ్‌లు సకాలంలో చెల్లించి ఉద్యోగుల్లో నమ్మకాన్ని కలిగించారని బాధితులు అంటున్నారు. కానీ ఈ ఏడాది జనవరి నుంచి జీతాల చెల్లింపులను పూర్తిగా నిలిపివేసినట్లు వారు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఈ కేసుపై విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. కంపెనీకి సంబంధించిన మరికొన్ని ఆర్థిక రికార్డులను, లావాదేవీల వివరాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

# పవన్ సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదు?

## తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామ్‌చందర్ రావు

**కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని ఎద్దేవా**

**ఎవరైనా, ఎక్కడైనా సభ పెట్టుకునే హక్కు ఉందని వ్యాఖ్య**

**రాజకీయ పరిస్థితులను బట్టి తెలంగాణలో పొత్తు ఉంటుందని వివరణ**

**జనసేనతో పొత్తుపై హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని వెల్లడి**



హైదరాబాద్,జూన్,4:

తెలంగాణలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ సభ పెడతానంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా, ఎక్కడైనా సభ పెట్టుకునే హక్కు ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జనసేన సభకు ఎందుకు అనుమతి ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఉద్దేశపూర్వకంగానే మళ్లీ తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టాలని చూస్తున్నాయని ఆరోపించారు. ఈ రెండు పార్టీలను ప్రజలు పూర్తిగా తిరస్కరించే పరిస్థితి వచ్చిందని అన్నారు. అందుకే తమ ఉనికిని కాపాడుకోవడానికే మళ్లీ ప్రాంతీయ సెంటిమెంట్‌ను వాడుకుంటున్నాయని మండిపడ్డారు. గతంలో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన ఎంఐఎంతో బీఆర్ఎస్ కలిసి పనిచేయలేదా? అని ఆయన నిలదీశారు. అది తెలంగాణ వ్యతిరేక శక్తులతో పనిచేసినట్లు అవ్వదా? అంటూ ప్రశ్నించారు.

రాజకీయ పరిస్థితులను బట్టి తెలంగాణలో పొత్తుపై ముందుకెళ్తామని రామచందర్ రావు స్పష్టం చేశారు. జనసేనతో పొత్తుపై పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు.

## ఇన్‌స్టాగ్రామ్ వేదిక మాత్రమే, బ్యాలెట్ బాక్స్ కాదు..

# కాక్రోచ్ పార్టీపై శశి థరూర్

**న్యూఢిల్లీ,జూన్,4:** కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ యువతకు, ముఖ్యంగా జెన్-జీ తరానికి కీలక సందేశం ఇచ్చారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఉద్యమాన్ని ఉద్దేశించి ఆయన 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికలో వ్యాసం రాశారు. "ఇన్‌స్టాగ్రామ్ అనేది మీ అభిప్రాయాలను పంచుకునే ఒక వేదిక మాత్రమే. కానీ అది ఓటు వేసే బ్యాలెట్ బాక్స్ కాదు" అని స్పష్టం చేశారు. కేవలం సోషల్ మీడియా నిరసనలతోనే మార్పు రాదని,

వ్యవస్థలో భాగస్వాములు కావడం ద్వారానే శాశ్వత మార్పు సాధ్యమవుతుందని యువతకు హితవు పలికారు. పేపర్ లీక్‌లు, పరీక్షల నిర్వహణలో వైఫల్యాల వల్ల యువత ఎదుర్కొంటున్న నిరాశ, కోపం చాలా సమంజసమైనవని థరూర్ అభిప్రాయపడ్డారు. అయితే ఆ కోపాన్ని కేవలం ఆన్‌లైన్ హేళనలకే పరిమితం చేయకుండా చట్టపరమైన, ప్రజాస్వామ్య మార్గాల్లో ఉపయోగించాలని సూచించారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రశ్నించడం, ప్రజాప్రతినిధులను నిలదీయడం వంటి పనుల ద్వారా వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావచ్చని సూచించారు. నిర్దిష్టమైన డిమాండ్లతో పోరాడినప్పుడే మీడియా కూడా సమస్యలతో పాటు పరిష్కారాలను చూపిస్తుందని పేర్కొన్నారు. యువత తమ నిరసనను కేవలం నినాదాలకే పరిమితం చేయకుండా పద్ధతి ప్రకారం ముందుకు తీసుకెళ్లాలని థరూర్ పిలుపునిచ్చారు. విద్యార్థి సంఘాలు,

న్యాయ నిపుణులు, పాలసీ సంస్థలతో కలిసి పనిచేసి గట్టిగా లాబీయింగ్ చేయాలన్నారు. "మీ కోపం నిరాశగా మారిపోనివ్వకండి.

మీ సంఖ్యా బలం, డిజిటల్ పరిజ్ఞానంతో దీర్ఘకాలిక మార్పు కోసం పోరాడండి" అని ఆయన ముగించారు. నిరుద్యోగం, పరీక్షల వివాదాలపై అభిజిత్ దిప్కే అనే యువకుడు సోషల్ మీడియాలో సరదాగా ప్రారంభించిన ఈ 'కాక్రోచ్ జనతా పార్టీ' ఉద్యమం ప్రస్తుతం దేశవ్యాప్తంగా మిలియన్ల మంది యువతను ఆకర్షిస్తోంది.

## ప్రభుత్వం అనుకుంటే

# నన్ను ఎప్పుడో పట్టుకునేది: లలిత్ మోదీ

## పరారీలో ఉన్న వ్యక్తిగా అభివర్ణించడంపై లలిత్ మోదీ ఆగ్రహం

న్యూఢిల్లీ,జూన్,4: తాను దేశం విడిచి పారిపోయిన వ్యక్తిననే ప్రచారాన్ని ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ తీవ్రంగా ఖండించారు. తాను ఎక్కడికీ పారిపోలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం అనుకుంటే తనను ఎప్పుడో పట్టుకునేదని అభిప్రాయపడ్డారు. భారత్ లాంటి శక్తిమంతమైన దేశం కళ్లు గప్పి ప్రపంచమంతా తిరగడం అసాధ్యమని వాదించారు. తాను పారిపోతున్నట్లు మీడియానే తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. దేశంలో తనపై ఉన్న కేసులను పూర్తిగా క్లియర్ చేసుకునేందుకు భారత్‌కు తిరిగి వస్తారా? అనే ప్రశ్నకు ఆయన ఆసక్తికర సమాధానం ఇచ్చారు. రుజువు చేసుకోవాలనే బలమైన కోరిక ఇప్పుడు తనలో లేదని స్పష్టం చేశారు. తనపై వస్తున్న ఆర్థిక అవకతవకలు, మనీ లాండరింగ్ ఆరోపణలను తోసిపుచ్చారు. కేవలం రాజకీయ కారణాలతోనే తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంటులో, ఎన్నికల ర్యాలీలలో తన పేరును ప్రస్తావించడంపై మండిపడ్డారు. .

ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ రాహుల్ గాంధీ తనపై విమర్శలు చేస్తున్నారని లలిత్ మోదీ పేర్కొన్నారు. క్రికెట్‌తో ప్రజలకు ఉన్న సెంటిమెంట్‌ను వాడుకోవడానికే తన పేరును ప్రస్తావిస్తున్నారని ఆరోపించారు. గత 2009లో ఐపీఎల్ టోర్నమెంట్‌ను దక్షిణాఫ్రికాకు మార్చడం వెనుక ఉన్న కథను వివరించారు. అప్పటి హోం మంత్రి చిదంబరం తనను బెదిరించారని, కావాలనే అడ్డుకున్నారని ఆరోపించారు. అప్పట్లో బీజేపీ పాలిత రాష్ట్రాలు మ్యాచ్‌లకు అనుమతి ఇచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వాలు నిరాకరించాయని తెలిపారు. చిదంబరం ఆదేశాల వల్లే టోర్నమెంట్‌ను దక్షిణాఫ్రికాకు మార్చాల్సి వచ్చిందని చెప్పారు. ఇందుకోసం షెడ్యూల్‌ను 154 సార్లు మార్చాల్సి వచ్చిందని వివరించారు.

# సంపాదకీయం

## శ్రమదోపిడీని ప్రోత్సహిస్తున్న పాలకులు..?



శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది ఏదీ లేదని మహాకవి శ్రీశ్రీ అన్నారు. కార్మిక లోకాన్ని తట్టి లేపిన విప్లవకారుడు శ్రీశ్రీ. అయితే దేశంలో ఐటి విప్లవం వచ్చిన తరవాత పాలకులు కార్మికులను పట్టించుకోవడం మానేశారు. నేటికీ వారి బతుకులు ఛిద్రం అవుతున్నా కనీసం పలకరింపులు, సానుభూతి వచనాలు లేవు. ఇప్పుడు కార్మికులంటే కేవలం కర్మాగారాల్లో పనిచేస్తున్నవారే కాదు. రోడ్డుమీద పడి పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ కార్మికులే. వారికి ముఖ్యంగా ఆరోగ్య, ఆర్థిక భద్రత లేదు. ఆకాశ హర్మ్యాలను కడుతున్నా.. కుటుంబబానికి దూరంగా ఊడిగం చేస్తున్నా కూలీ తప్ప పెద్దగా ప్రయోజనాలు కలగడం లేదు. వీరందరికీ ప్రధానంగా ఆరోగ్య వసతి, పెన్షన్ పథకాలు కలగాలి. పనిచేసే ప్రతి ఒక్కరినీ కార్మికులుగా చూడాలి. వారికి విద్య,ఆరోగ్య, పెన్షన్ భద్రత వంటి కనీస సౌకర్యాలు కలగాలి. అలాగే అసంఘటిత కార్మికులను ఆదుకునే ప్రయత్నాలు చేయాలి. పాలకులంతా ఎసి కార్లలో, విమానాల్లో తిరుగుతూ.. ఎసి బంగలాల్లో నివస్తున్నారు. వీరికి సామాన్యుల కష్టాలు తెలియడం లేదు. ప్రజలు కట్టిన పన్నులతో జల్సాలు చేస్తున్నారు. సమాజ గతిని, పురోగతిని శాసించేది, నిర్దేశించేది శ్రామిక వర్గమే. ఆ శ్రమే వెట్టిచాకిరికి గురవుతోంది. శ్రామికుడు దోపిడీకి గురవుఉతన్నాడు. పరిస్థితులు ఇలాగే ఉంటే.. కష్టించి పని చేసే చేతులు పిడికిళ్లు బిగిస్తాయని గుర్తించాలి. ఉద్యమాలు పుట్టుకొస్తాయి. కార్మిక దినోత్సవ ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేం. కానీ 1886లో షికాగోలోని హే మార్కెట్‌లో జరిగిన కార్మికుల ప్రదర్శనే ఈ మే డే పుట్టుకకు పునాది వేసిందని చెబుతారు. కానీ ఆ ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో కొందరు కార్మికులు చనిపోయారు. ఆ సంఘటన అనంతరం 1889 నుంచి 1890 వరకు అనేక దేశాల్లో కార్మికుల ఉద్యమాలూ, నిరసన ప్రదర్శనలూ చోటుచేసుకున్నాయి. షికాగోలో జరిగిన కార్మిక ప్రదర్శనలో చనిపోయిన వారికి గుర్తుగా మే 1ని కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలన్న ఒప్పందం కూడా కుదిరింది. భారతదేశంలో చాలా ఆలస్యంగా కార్మిక దినోత్సవాన్ని జరుపుకున్నాము. 1923 మే 1వ తేదీన మద్రాసులో లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో తొలిసారి ఈ వేడుకలను జరుపుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఐరోపా దేశాల్లో మే 1వ తేదీని సెలవు దినంగా పాటించడం మొదలు పెట్టారు. అనంతరం అనేక దేశాలు ఇదే బాటలో నడిచాయి. చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలు ఆ రోజునే అమల్లోకి వచ్చాయి. కార్మిక దినోత్సవం సందర్భంగా చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించి అనేక సంక్షేమ పథకాలు పుట్టుకొచ్చాయి. అలాగే సంక్షేమ పథకాల అమలుకు, నిరసన ప్రదర్శనలకు మే 1వ తేదీ వేదికగా మారింది. ముఖ్యంగా మేడే రోజున కార్మికులు వారి హక్కులను గుర్తు చేసుకోవడం, సమాజానికి వారు చేసిన సేవలకు గాను తగిన గుర్తింపు ఇచ్చి వారిని సన్మానించడం చేస్తున్నాం. 1916లో తొలిసారిగా రోజుకు 8 పని గంటలు మాత్రమే అన్న డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మనదేశంలో ఇతర దేశాల కంటే ముందే కలకత్తాలో కార్మికుల పనిగంటల కోసం హౌరా రైల్వే స్టేషన్లో 1862లోనే సమ్మె చేశారు. 1923లో తొలిసారిగా భారత్ దేశంలో మే డే ను పాటించారు. ఆ తర్వాత 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడడంతో అప్పటి నుంచి కార్మికవర్గాల్లో చైతన్యం మొదలైంది. దీంతో మే డే పాటిస్తున్నారు. కానీ అసంఘటిత కార్మిక వర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడంలేదు. మనదేశంలో అసంఘటిత రంగం పూర్తిగా నిరాదరణకు గురవుతోంది. నిర్మాణ, వ్యవసాయ, గిర కార్మిక రంగాలు పూర్తిగా వెలివేయ వడ్డాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాల్లో కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటారు. సామాజిక న్యాయం, అందరికీ గౌరవప్రదమైన పనిని ప్రోత్సహించడానికి పాలకులు ముందుకు రావాలి. ముఖ్యంగా, ఐ.టి.రంగంలో ఎంతోమంది ఆడపిల్లలు, యువకులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే అక్కడ కంపెనీలు పెడుతున్నారు. అమెరికాలో వున్న కంపెనీలు అక్కడ ప్రజాచైతన్యం ఉన్నది కాబట్టి కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపెనీలు పెడుతూ వాళ్ళచే 10,12 గంటలు పనిచేయి స్తున్నారు. ఐటి రంగంలో పనిచేస్తున్న విద్యావంతులైన యువత శ్రమ దోపిడీకి బలవుతున్నది. రాత్రుళ్లు ఆడపిల్లలను భద్రతలేకుండా ఇళ్ళకు పంపించడం మూలంగా నేరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నంతవరకు శ్రమదోపిడీ, ఎక్కువ పనిచేయించుకోవడం సర్వసాధారణం. కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో కూడా అమలుకై పోరాటం ఇప్పుడు అత్యంత అవసరం. కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవర్గాలు బహుళజాతి కంపెనీలకు హామీలిస్తూ దేశంలోకి స్వాగతిస్తున్నాయి. అసంఘటితరంగంలో అయితే సరేసరి. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగుల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ సోర్సింగ్‌లోను కార్మిక చట్టాల నియమాలు అమలు కావడం లేదు. అందుకే అనేక సంస్థల్లో రెగ్యులర్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులే అధికమైనారు. అంతేకాకుండా ప్రభుత్వరంగంలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోయింది. నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇది విద్యా, వైద్య రంగాల్లో ప్రయివేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తక్కువవుతుంది కాబట్టి శ్రమదోపిడీ కూడా పెరుగుతుంది. వెనుకటికి స్కూళ్ళు 10 నుండి 14గంటల వరకు పనిచేసేవి. పిల్లవాణ్ణి ఆరు గంటల కంటే ఎక్కువ చదివించకూడదని విద్యావేత్తలు, పరిశోధకులు చెబుతున్నా, సెమి రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పేర పాఠశాలలు సర్వసాధారణమైపోయాయి. అందుకే ప్రైవేట్ టీచర్స్ నోరు మెదపకుండా 12 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రపంచీకరణ వలన వంద సంవత్సరాల క్రితం సాధించిన కనీస డిమాండ్లు కూడా ఈనాడు అమలుకు నోచుకోవడంలేదు. ఎనిమిది గంటల పనికోసం చేసిన పోరాటం పెట్టుబడిదారీ వర్గం పతనానికి ఆరంభమవుతుందనుకున్నాం. కానీ మళ్ళీ మార్కెట్ శక్తులు పాత పరిస్థితులకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్నాయి. ఆనాటి కార్మికవర్గ చైతన్యం మరోసారి వెల్లివిరుస్తుందని, ఈ మే డే నాడు కొత్త స్ఫూర్తిని రగిలిస్తుం దని ఆశిద్దాం. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు, మొదలైనవి శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న ఈ తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు

## జూన్ 7న హరీస్ రావు నేతృత్వంలో సింగరేణి అవినీతి పై అవగాహన సదస్సు --- టీబీజీకేస్ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ పిలుపు

(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) జూన్ 7న సాయంత్రం 5 గంటలకు మాజీ మంత్రి హరీష్ రావు ఆధ్వర్యంలో శ్రీమహి ఫంక్షన్ హాల్ జరగబోయే సదస్సు సింగరేణి సంస్థలో అందుతున్న అవినీతులపై ప్రజల్లో అవగాహన కలిగించే లక్ష్యంతో నిర్వహించబడుతుంది – టీజీబికేఏస్ గౌరవ అధ్యక్షులు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌లి ఈ సందర్భంగా గోదావరిఖని టీజీబీకేఎస్ పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మాదాసి రామ్మూర్తి, చెల్పూరి సతీష్ తదితరులు పాల్గొని సదస్సుకు సంబంధించి గోడ పోస్టర్లు మరియు కీలక పత్రాలు ఆవిష్కరించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సింగరేణి లో అనేక అవినీతి కుంభకోణం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం పోరాడుతున్న క్రమంలో దీనిని మరింత విస్తృతం గా కార్మికుల లోకానికి ప్రజల్లోకి తీసుకొని పోడానికి గొప్ప ప్రయత్నం చేస్తున్నాం అని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సింగరేణి సంస్థను దాదాపు నిర్వీర్యం చేసే ప్రయత్నం జరిగింది. ఈ ప్రభుత్వం లో అనేక కుంభ కోణాలు, అవినీతి ఆరోపణలు, అదేవిధంగా సింగరేణి సంస్థను ఒక జేబు లో సంస్థ లాగా, ఏటీఎం లా ప్రభుత్వం లాడుతోంది ఒక వైపు వేలాది కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణి సంస్థ రావాల్సి ఉండగా వాటిని విడుదల చేయకుండా గతం లో మిగులు బడ్జెట్ లో 4 వేల కోట్ల ఓడి ఉన్న సింగరేణి సంస్థ వాణ తీసుకొచ్చి జీతాలు ఇచ్చే పరిస్థితికి వచ్చింది .దీనికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వం, పూర్తి స్థాయిలో ఈ సంస్థను సర్వనాశనం చేసి ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే కుట్రలో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి కోల్ మైన్స్ కు బాధ్యత వహిస్తున్న బట్టి విక్రమార్క కంకణం కట్టుకున్నట్లుగా కనిపిస్తోంది. గౌరవనీయులు హరీష్ రావు గారు శాసన సభ వేదికగా, ప్రజా వేదికగా ఇప్పటికే ఈ సింగరేణి సంస్థలో జరుగుతున్నా అనేక కుంభకోణాలను ప్రజలకు వివరించడం జరిగిందని గుర్తు చేశారు కాంగ్రెస్ ముఖ్యమంత్రి మంత్రులు వాటికి సమాధానం చెప్పకుండా ఎదురుదాడి చేయడం, తప్పించుకోవడం తప్పా ప్రజా క్షేత్రంలో సమాధానం చెప్పాలి విధానం ఈ ప్రభుత్వం కనిపించడం లేదు .నైని బొగ్గు బ్లాక్ అనేది దీనిని పెద్ద ఉదాహరణ స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిదికి కట్టబెట్టాలనే ప్రయత్నం లో భాగంగానే ఎన్నడూ లేని సైట్ విజిటింగ్ సర్టిఫికెట్ కు తీసుకొచ్చి, వారి సన్నిహితులకు నాదీ టెండర్ ను కట్టబెట్టాలనే ఉద్దేశంతో ఈ సైట్ విజిటింగ్ ను తీసుకురావడం జరిగింది.. ముఖ్యంగా బిఆర్ ఎస్ పార్టీ పోరాటం వల్లనే ఆగిపోయింది బిఆర్ ఎస్ ప్రభుత్వం లో కెసిఆర్ గారి నాయకత్వంలో ఈ సింగరేణి సంస్థ మనుగడ తో పాటు, ఉత్పత్తిని పెంచడంతో పాటు, సింగరేణి సంస్థ కార్మికుల సంక్షేమానికి కేసిఆర్ గారు కృషి చేశారని గుర్తు చేశారు అనేక సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న అనేక సమస్యలకు స్వయంగా కెసిఆర్ గారే పరిష్కారించారు ఎప్పుడై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చిందో తెలంగాణ ఉద్యమానికి సంబంధంలేని ముఖ్యమంత్రి గద్దె నెక్కాడో ఆనాడు సింగరేణి కార్మికులు ఆవేదన పడ్డ విషయం డిపెండెంట్ ఎంప్లాయిమెంట్. తెలంగాణ రాష్ట్ర వచ్చిన తర్వాత దానిని పునరుద్ధరించి దాదాపు 19 వేల పైచిలుకు ఉద్యోగాలు కల్పించి, అర్హత కలిగిన మహిళలను సింగరేణి సంస్థలో ఉ ద్యోగం చేసే హక్కు కల్పించింది కెసిఆర్ గారు అని కొనియాడారు బొగ్గు బాబు కార్మికులకు అనేక సౌకర్యాలు ఉండాలని, జీతభత్యాలు విషయంలో వారి లాభాల వాటా కూడా ఉదారంగా ఉండాలనే ఉద్దేశ్యంతో 16 శాతం ఉన్న లాభాల వాటాను 32 శాతం వరకు తీసుకుపోయి నాయకులు కెసిఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఏం జరుగుతుంది ఈ సంస్థను సర్వనాశనం చేసే ప్రయత్నం లో సోలార్ పవర్ ప్లాంట్ దేశంలో ఎక్కడ లేని విధంగా పది నుంచి పదిహేను శాతం ఎక్సెస్ టెండర్లు వేసి, వందల కోట్ల నష్టాన్ని సింగరేణి సంస్థకు తెచ్చిపెట్టింది రేవంత్ రెడ్డి సర్కార్ సింగరేణి లో బ్లాస్టింగ్ కోసం డిటోనేటర్ ధర అధికంగా చూపించి కాంట్రాక్టర్లు లాభం చేకూర్చి సింగరేణి సంస్థ కు వందల కోట్ల రూపాయల నష్టాన్ని తెచ్చిపెట్టింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం అలాగే పవర్ ప్రాజెక్ట్ లో వెయ్యి కోట్ల రూపాయల టెండర్ల వ్యయం పెంచి లబ్ది పొందే, సింగరేణి సంస్థకు మాత్రం నాశనం చేసే ప్రయత్నం జరిగింది దీనిని అడ్డుకోవడానికి



బాధ్యత తెలంగాణ రాష్ట్రం సాధించిన తెలంగాణ ఉన్న ఏకైక సంస్థం ఈ సింగరేణి సంస్థలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ గారు పనిచేసే కాలంలో 1 లక్ష 21 వేల మంది పనిచేసేవారు, లక్షల మందికి ఉపాధి అవకాశాలు ఉద్యోగ అవకాశాలు కల్పించినా సంస్థ సింగరేణి సంస్థ అని గుర్తు చేశారు .కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సింగరేణి లో 36 వేల కాంట్రాక్టు కార్మికులు అయితే 38 వేల మంది కార్మికులకు తగ్గింది .ఈ సింగరేణి సంస్థను సర్వనాశనం చేసి ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వం జరిగింది, దీనిని వ్యతిరేకిస్తూ టీబీజీకేఎస్ సంస్థ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కు హటావో సింగరేణి బచావో నినాదం తో సింగరేణి పరిరక్షణ కోసం కార్మికులకు,కార్మిక కుటుంబాలకు ఒక అవగాహన కల్పించేందుకు మాజీ మంత్రి హరీష్ రావు రావడం జరిగిందని, ఈ సందర్భంగా సింగరేణి కి సంబంధించిన అనేక విషయాలు వివరించడం కోసం ఈ నెల 7.వ తేదీన సాయంత్రం 5 గంటలకు సదస్సు ను గోదావరిఖని శ్రీమహి ఫంక్షన్ హాల్ లో నిర్వహించనున్నట్లు తెలిపారు .ఈ సదస్సు కాంగ్రెస్ ప్రభుత్వానికి, సంస్థ యాజమాన్యానికి కనువిప్పు కలిగేలా ఈ సదస్సు జరుగుతోందని వారు తెలిపారు. ఈ సదస్సు పెద్ద ఎత్తున కార్మికుల లోకం కదిలి వచ్చి విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షులు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు..

## అంగన్వాడి కేంద్రాలకు పంపిణీ చేస్తున్న పోషక ఆహారం మరియు యూనిఫార్మ్స్ పంపిణీ

### 38వ డివిజన్ కార్పొరేటర్ నెల కంటి రాము ముఖ్యఅతిథిగా- అంగన్వాడి టీచర్ తిరుమల ఆధ్వర్యంలో

(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) రామగుండం శాసనసభ్యులు రాజ్ మక్కాన్సింగ్ ఠాగూర్ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగన్వాడి కేంద్రాలకు పంపిణీ చేస్తున్న పోషక ఆహారం మరియు యూనిఫార్మ్స్ పంపిణీ కార్యక్రమానికి స్థానిక 38వ డివిజన్ కార్పొరేటర్ నెల కంటి రాము గారు ముఖ్యఅతిథిగా హాజరైనారు. 38వ డివిజన్లోని అంగన్వాడి టీచర్ తిరుమల ఆధ్వర్యంలో పిల్లలకు అంగన్వాడి యూనిఫామ్ మరియు బాలామృతం కోడిగుడ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నెలకంటి రాము గారు మాట్లాడుతూ పిల్లల మానసిక సృజనాత్మక పెరుగుదల విషయంలో శారీరక దారుఢ్యం విషయంలో అంగన్వాడి కేంద్రాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి అని కొనియాడారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకి అదేవిధంగా కడుపుతో ఉన్న తల్లులకు ప్రతిరోజు ఉదయం టిఫిన్ మధ్యాహ్నం భోజన కార్యక్రమం ఏర్పాటు చేసి అంగన్వాడీ కేంద్రాలను ఇంకా ముందుకు తీసుకెళ్తానని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలుపుతూ రామగుండం నియోజకవర్గం అభివృద్ధిలో



అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తానని మాట్లాడిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ గారి కృషిని గుర్తు చేశారు. కోట రాజుగారు మాట్లాడుతూ పిల్లలకి మొబైల్ ఫోన్లు మరియు టెలివిజన్లను దూరం చేసి అంగన్వాడి కేంద్రాలకు పంపించి వారి మానసిక సృజనాత్మకతలో తోడ్పడాల్సిందిగా తల్లులు సహకరించాలని కోరారు.

## జీడికే 1. గ్రూపు పరిధిలో క్లీనింగ్ పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వెంటనే జీతాలు ఇవ్వాలి



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) సింగరేణి సంస్థ జీడికే వన్ గ్రూప్ పరిధిలో 1.ఇంక్లైన్, 2, 2ఆ. ఇంక్లైన్ లలో క్లీనింగ్ పనులు చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు జూల సాయిరాం అనే కాంట్రాక్టర్ సకాలంలో వేతనాలు చెల్లించక కార్మికులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని గత ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే. 4 నెలలు నుండి జీతాలు ఇవ్వడం లేదు. వెంటనే నాలుగు నెలల జీతాలను ఇప్పించాలని కోరుతూ డీజీఎం పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. వన్ గ్రూప్ లో హౌస్ కీపింగ్ కార్మికులకు గత నాలుగు నెలల నుండి జీతాలు లేక కాంట్రాక్టు కార్మికులు వారి కుటుంబాలను పోషించుకోలేక డ్యూటీలకు రావడానికి చార్జీలు కూడా లేనీ పరిస్థితి తో అనేక అవస్థలు పడుతున్నారు. ఈ కార్మికులు మన సంస్థ సింగరేణి లో తమ పంట పొలాలు, వ్యవసాయ భూములు, ఇండ్లు కోల్పోయి భూ నిర్వాసితులుగా నిరుపేద కుటుంబాల కు చెందిన వారు. జీతం వస్తే కానీ పూటగడవని పరిస్థితినీ ఎదుర్కొంటున్నారు. అలాగే ఈ కార్మికులకు యూనిఫామ్, బూట్లు, చీపుర్లు, హెల్మెట్, బ్లౌజ్ లు ఇవ్వాలని, ప్రతినెల 7వ తారీకు లోపు జీతాలు ఇవ్వాలని చట్టబద్ధమైన హక్కులను అమలు చేయించాలని,పని భద్రత సేఫ్టీ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్మికుల కుటుంబాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని గత పిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే. 4.నెలల జీతాలు ఇప్పించాలని అలాగే జూల సాయిరాం అనే కాంట్రాక్టర్ పై తగిన చర్య తీసుకోని కార్మికులకు ప్రతినెల 7వ తారీకు లోపు జీతాలు వచ్చే విధంగా సహకరించగలరని తమరికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో ౹ాజజఔఖ – ×ఖీఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి అశోక్, జిల్లా అధ్యక్షులు ఈ నరేష్, జిల్లా నాయకులు ఐ రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## పద్మశ్రీ డాక్టర్ పి.విజయ్ ఆనంద్ రెడ్డికి ఘన సన్మానం

హైదరాబాద్, జూన్ 04 : తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో ప్రముఖ ఆంకాలజిస్ట్, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ డాక్టర్ పి. విజయ్ ఆనంద్ రెడ్డిని గురువారం అపోలో ఆసుపత్రిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు అనంతరం తనపై మరింత బాధ్యత పెరిగిందని, క్యాన్సర్ రోగ రహిత సమాజం కోసం అధునాతన చికిత్సల ద్వారా సేవలు కొనసాగిస్తానని తెలిపారు. క్యాన్సర్ లక్షణాలు, నివారణ చర్యలు, చికిత్సా విధానాలపై అవగాహన కల్పించారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా క్యాన్సర్ రోగులకు సేవలందిస్తున్న డాక్టర్ విజయ్ ఆనంద్ రెడ్డి వైద్య రంగంలో విశిష్ట కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం ఆయనకు శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కే.జోజిరెడ్డి, ప్రొ.అక్తర్ అలీ, బల్వంత్ రెడ్డి, బి.సంపత్ కుమార్, మధుబాబు,

## ప్రాణదార హాస్పిటల్ నిర్లక్ష్యంపై కదలిన 'రంగా శ్రీనివాస్ గౌడ్

**కుత్బుల్లాపూర్, జూన్, 4,** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి లో ని ?చింతల్‌వైద్యుల తీవ్ర నిర్లక్ష్యానికి బలైపోయిన ఒక పేద కుటుంబానికి అండగా నిలబడి, హాస్పిటల్ యాజమాన్యం మెడలు వంచి న్యాయం చేశారు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్రకార్యవర్గ సభ్యులు రంగా శ్రీనివాస్ గౌడ్.? ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ?రెండు నెలల క్రితం చింతల్‌కు చెందిన తిరుపతి రెడ్డి కి గుండెపోటు రావడంతో, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని చింతల్‌లో ఉన్న ప్రాణహిత హాస్పిటల్ కు తరలించారు. తమ వద్ద అన్ని రకాల అత్యాధునిక వైద్య సదుపాయాలు, ఎక్విప్‌మెంట్స్ ఉన్నాయని, రోగిని క్షేమంగా కాపాడుతామని నమ్మబలికిన హాస్పిటల్ యాజమాన్యం.. బాధితుడికి హెల్త్ ఇన్సూరెన్స్ ఉన్నప్పటికీ ?1,60,000 నగదును ముందే కట్టించుకున్నారు.?మరుసటి రోజు ఉ దయం 6 గంటలకే డాక్టర్ వస్తారని, ట్రీట్‌మెంట్ చేస్తామని చెప్పిన హాస్పిటల్ సిబ్బంది.. ఉదయం 11 గంటలైనా వైద్యుడిని తీసుకురాలేకపోయారు. కనీస బాధ్యత లేకుండా కాలయాపన చేస్తూ, చివరికి మా వద్ద సదుపాయాలు లేవు, వేరే హాస్పిటల్‌కు తీసుకెళ్లండి అంటూ చేతులెత్తేశారు.?హాస్పిటల్ నిర్లక్ష్యంతో ప్రాణం బలి?ప్రాణదార హాస్పిటల్ చేసిన గంటల కొద్దీ ఆలస్యం (డిలే ) కారణంగా, తిరుపతి రెడ్డి ని వేరే హాస్పిటల్‌కు తరలించి స్టంట్ వేసినప్పటికీ ఫలితం లేకపోయింది. హాస్పిటల్ యాజమాన్యం చేసిన నిర్లక్ష్యపు సమయం వల్ల ఆయన మరుసటి రోజే ప్రాణాలు కోల్పోయారు. ఒక నిండు ప్రాణం పోవడానికి ప్రాణదార హాస్పిటల్ నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.?రంగంలోకి దిగి న్యాయం చేసిన రంగా శ్రీనివాస్ గౌడ్?ఈ ఉ దంతం తెలుసుకున్న రంగా శ్రీనివాస్ గౌడ్ బాధితుడి కుటుంబ సభ్యులతో కలిసి నేరుగా ప్రాణదార హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడారు. హాస్పిటల్ చేసిన నిర్లక్ష్యాన్ని, నైతిక విలువలు లేని ప్రవర్తనను తీవ్రంగా నిలదీశారు.?రంగా శ్రీనివాస్ గౌడ్ గట్టి హెచ్చరికలు, పోరాటంతో దిగివచ్చిన ప్రాణదార హాస్పిటల్ యాజమాన్యం.. తిరుపతి రెడ్డి కట్టిన ?1,60,000 రూపాయల పూర్తి మొత్తాన్ని వారి కుటుంబ సభ్యులకు తిరిగి (రిఫండ్ ) చెల్లించింది.?డబ్బుల కోసం కక్కుర్తి పడి, రోగుల ప్రాణాలతో ఆడుకునే ఇలాంటి హాస్పిటల్స్ తీరు మారాలి. తిరుపతి రెడ్డి ప్రాణాన్ని తిరిగి తీసుకురాలేకపోయినా, ఆయన కుటుంబానికి ఆర్థికంగా అన్యాయం జరగకుండా అండగా నిలబడడం నా బాధ్యతగా భావించాను. రంగా శ్రీనివాస్ గౌడ్?బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చొరవ తీసుకున్న రంగా శ్రీనివాస్ గౌడ్ కి కార్తీక్ గౌడ్ బాబురావు సిహెచ్ వెంకట్ రెడ్డి కి కేశవరెడ్డి కి ప్రతి ఒక్కరికి తిరుపతి రెడ్డి కుటుంబ సభ్యులు మరియు స్థానిక ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# ఏపీలో కొత్త పొత్తులు

విజయవాడ, : ఏపీలో కమ్యూనిస్టులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో జత కడతారా? అందుకు జగన్మోహన్ రెడ్డి సిద్ధంగా ఉన్నారా? రెండువైపుల నుంచి చర్చలు మొదలయ్యాయా? రెండు వైపులా ఇది అవశ్యమా? పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఏపీలో కూటమి ప్రభుత్వం ఉంది. ఎన్డీఏలో తెలుగుదేశంతో పాటు జనసేన భాగస్వామ్య పక్షాలు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో బిజెపి ఉంది. వైసిపి ఒంటరి పోరాటం చేస్తోంది. జాతీయస్థాయిలో ఇండియా కూటమి లో కాంగ్రెస్ తో పాటు వామపక్షాలు ఉన్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో తటస్థ వైఖరి అనుసరిస్తోంది. కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకించి బిజెపి విషయంలో సానుకూలంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో ఒంటరి పోరాటం కంటే వామపక్షాలతో పొత్తు పెట్టుకోవడమే మేలన్న నిర్ణయానికి జగన్ వచ్చినట్లు ప్రచారం నడుస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా సిపిఎం జగన్ విషయంలో సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. సిపిఎం ప్రధాన కార్యదర్శిగా ఉన్న మధు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేత. ఆయన అసలు పేరు మధుసూదన్ రెడ్డి గా తెలుస్తోంది. జగన్మోహన్ రెడ్డికి బంధువు అవుతారని కూడా ప్రచారంలో ఉంది. జగన్మోహన్ రెడ్డి సీఎం గా ఉన్న సమయంలో మధు అనారోగ్యానికి గురైతే పరామర్శించారు. అటు తరువాత సిపిఎం అనుబంధ పత్రికకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున భారీగా ప్రకటనలు కూడా వచ్చాయి. దీంతో గత పదేళ్లుగా జగన్ విషయంలో సిపిఎం పెద్దగా సౌండ్ చేయలేదు. కానీ సిపిఐ మాత్రం గత ఐదేళ్లలో జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా గట్టిగానే స్టేట్మెంట్లు ఇచ్చిందిమారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో జగన్ పొత్తుల విషయంలో పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఒంటరి పోరాటం చేయడం సాహసమే. అందుకే వామపక్షాలతో పొత్తు పెట్టుకోవడం మేలన్న నిర్ణయానికి జగన్ వచ్చినట్లు తెలుస్తోంది. తాజాగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా కడప జిల్లాకు చెందిన ఈశ్వరయ్య ఎంపికయ్యారు. దీని వెనుక పొత్తు స్నేహం ఉన్నట్టు ప్రచారం సాగు తోంది. అయితే బిజెపికి జగన్ సానుకూలంగా ఉంటారు. ఇండియా కూటమికి వ్యతిరేకంగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకిస్తున్నారు. అలాగే చంద్రబాబు పట్ల వామపక్షాలకు ఆ స్థాయిలో వ్యతిరేకతలేదు. కానీ ఇప్పుడు ఏపీలో రాజకీయ ఉనికి చాటుకోక తప్పదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ కంటే ఏపీలో వైసీపీ బలంగా ఉంది. అందుకే ఆ పార్టీతో స్నేహం కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నాయి వామపక్షాలు. ఇప్పటివరకు ఒంటరి పోరాటం అన్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నినాదం. దమ్ముంటే ఒంటరిగా పోటీకి రండి అంటూ టిడిపి తో పాటు జనసేనకు సవాల్ విసురుతూ వస్తోంది వైసిపి. 2014, 2019 ఎన్నికల్లో ఇదే వామపక్షాలు ఉన్న జగన్ పట్టించు కోలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వామపక్షాల ఉద్యమాన్ని అణచివేశారు జగన్. అడుగడుగునా వారిని అవమానించారు. అటువంటి వామపక్షాలు ఇప్పుడు జగన్తో జతకలుస్తాయి అన్నది అనుమానమే. అయితే ఇప్పుడు పొత్తు ఇరువర్గాలకు అనివార్యం. ఆపై కూటమి ప్రభుత్వం బలంగా ఉంది. అందుకే ఇప్పుడు ఆ రెండు పక్షాలు కలుస్తాయని ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# దేశీయ తొలి ప్రైవేట్ రాకెట్..

## హైదరాబాదీ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ అరుదైన ఘనత




### వాణిజ్య ప్రయోగానికి స్కైరూట్ సిద్ధం

### భారత్‌లో ఇస్రో కాకుండా ఇతర సంస్థలకిదే మొదటిసారి

హైదరాబాద్,: దేశంలో అంతరిక్ష ప్రయోగాలకు కేరాఫ్ అడ్రస్ ఇస్రో. అయితే భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కున్న ఈ ఘనత ఇక ఎంతోకాలం కొనసాగకపోవచ్చు. అవును మరి. ఇస్రోను తక్కువ చేయడం కాదుగానీ.. హైదరాబాదీ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ ఓ వాణిజ్య రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతున్నది. భారత్‌లో ఈ తరహా తొలి ప్రైవేట్ రాకెట్ ఇదే కావడం విశేషం. హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్.. స్కైరూట్ ఏరోస్పేస్ ఓఅరుదైన ఘనతను సాధించబోతున్నది. దేశంలోనే మొదటిసారి సొంతంగా ఓ వాణిజ్య రాకెట్‌ను తయారుచేసి ప్రయోగించబోతున్నది. వచ్చే 3 నెలల్లో ఈ భారత తొలి ప్రైవేట్, కమర్షియల్ రాకెట్ గగనతలంలోకి దూసుకుపోవచ్చని చెప్తున్నారు. ప్రస్తుతం దేశీయంగా భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మాత్రమే ఈ తరహా ప్రయోగాలను చేస్తున్నది. అయితే ఇక స్కైరూట్ ఏరోస్పేస్ సైతం అందుకు వేదిక కాబోతుండటం గమనార్హం.

జనవరిలో..: ఇద్దరు మాజీ ఇస్రో శాస్త్రవేత్తల కంపెనీయే ఈ స్కైరూట్ ఏరోస్పేస్. వచ్చే ఏడాది జనవరిలో అంతరిక్షంలోకి తమ తొలి పూర్తిస్థాయి శాటిలైట్ మిషన్‌ను పంపాలని స్కైరూట్ ప్రయత్నిస్తున్నది. దీంతో భారతీయ అంతరిక్ష పరిశోధనా రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి పునాదులు పడ్డట్టేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, టీమ్‌సెక్, జీఐసీ వంటి ఇన్వెస్టర్లు ఈ ప్రాజెక్టు వెనుక ఉన్నారు. అయితే వచ్చే ఏడాది ప్రతీ 3 నెలలకోసారి ఒక ప్రయోగాన్ని చేపట్టాలని స్కైరూట్ యోచిస్తున్నది. ఈ క్రమంలోనే 2027కల్లా నెలకోసారి జరుపాలనుకుంటున్నామని చెప్తున్నది.

9 నెలలు.. 3 మిలియన్ డాలర్లు: ఒక్కో రాకెట్ నిర్మాణానికి దాదాపు 8-9 నెలల సమయం పడుతుందని, 2-3 మిలియన్ డాలర్ల ఖర్చు అవుతుందని స్కైరూట్ సీఈవో పవన్ చందన చెప్తున్నారు. దేశ, విదేశీ కస్టమర్ల పేలోడ్స్‌తో ఒక్కో ప్రయోగం ద్వారా సుమారు 5 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని అందుకోవచ్చునీ అంటున్నారు. ఇక ప్రపంచవ్యాప్తంగా చిన్నపాటి శాటిలైట్ల ప్రయోగాలకు డిమాండ్ పెరుగుతున్నదంటున్న స్కైరూట్.. తమ ప్రయోగాలతో ము న్ముందు భారత, అంతర్జాతీయ క్లయింట్లకు మరింత చౌకగా ఈ సేవలు అందుబాటులోకి వస్తాయన్న ఆశాభావాన్ని వెలిబుచ్చుతున్నది. 2018లో స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థను స్థాపించారు.

ఫండింగ్‌లో భాగంగా రూ.850 కోట్ల నిధులను ఈ కంపెనీ సమీకరించింది. 2022 నవంబర్‌లో తమ సబ్‌ఆర్బిటల్ వెహికిల్ విక్రమ్-ఎస్‌ను పరీక్షించడం ద్వారా ఓ రాకెట్‌ను లాంచ్ చేసిన తొలి ప్రైవేట్ భారతీయ సంస్థగా స్కైరూట్ గుర్తింపు పొందింది. ప్రస్తుతం ఇంజినీరింగ్, సరఫరాపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్న ఈ సంస్థ.. 2028 మార్చి నాటికి లాభాల్లోకి అడుగుపెడుతామన్న ధీమాను కనబరుస్తున్నది. భారతీయ ప్రైవేట్ స్పేస్ ఇండస్ట్రీలో 200కుపైగా స్టార్టప్‌లు. 2033కల్లా ఈ రంగం విలువ 44 బిలియన్ డాలర్లకు చేరగలదని డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ అంచనా వేస్తున్నది.


# ఎంజీఎంలో ఏం జరుగుతోంది..?



వరంగల్: వైద్యులను ప్రాణదాతలు అని పిలుస్తుంటారు. కనిపించే దేవుళ్ళగా రోగులు కొలుస్తుంటారు. అటువంటి గొప్ప పేరు ఉన్న వైద్యులు రోగులకు చికిత్స అందించి.. ఇంకా మంచి పేరు తెచ్చుకోవాల్సి ఉండగా.. చికిత్సను పక్కనపెట్టి దోపిడికి పాల్పడుతున్నారు. అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడి ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల విభాగంలో అతిపెద్దదైన ఎంజీఎం లో అవినీతి వ్యవహారం తెరపైకి వచ్చింది. ఇటీవల ఈ ఆసుపత్రిలో ఒకటే ఆక్సిజన్ సిలిండర్ ను ఇద్దరు చిన్నారులకు పెట్టడం చర్చకు దారి తీసింది. దీనిపై మీడియాలో ప్రముతంగా వార్తలు రావడంతో వైద్య శాఖ మంత్రి ఎంజీఎం పై చర్యలు తీసుకున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే అందులో నిజం లేదని తర్వాత తేలింది.. ఇటీవల ఎంజీఎం లో రోగులపై సెక్యూరిటీ గార్డ్ లు దాడి చేశారు. ఆ దాడికి సంబంధించిన దృశ్యాలు కూడా మీడియాలో విపరీతంగా కనిపించాయి. ఈ ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించడం.. మీడియాలో ప్రముఖంగా రావడంతో ఎంజీఎం సూపరింటెండెంట్ పై చర్యలు తీసుకున్నది. ఈ సంఘటన తర్వాత ఎంజిఎం లో ఓ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఎంజీఎం లో అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల రెండు కోట్ల నిధులు పక్కదారి పట్టాయని ఆరోపణ వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ నిధులు స్వాహా కావడంతోపాటు టెండర్లు వేయకుండానే స్టేషనరీ కొనుగోలు చేసినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ వ్యవహారం ఆస్పత్రి వర్గాలలో చర్చకు దారితీస్తోంది. ఎంజీఎం లో పనిచేస్తున్న ఉన్నతాధికారుల్లో ఒకరు ఈ అవినీతి వ్యవహారాన్ని మీడియాకు లిక్ చేసినట్టు తెలుస్తోంది. ఓవర్గం ఎంజీఎంలో ఇష్టాను సారంగా ప్రవర్తిస్తోందని.. పై అండలు చూసుకుని అడ్డగోలుగా దోపిడీ చేస్తోందని మరో వర్గం ఆరోపిస్తోంది. మరో వర్గానికి చెందిన ఉన్నతాధికారి మీడియాకు లింకులు ఇవ్వడంతో ఈ వ్యవహారం బయటికి వచ్చింది. ఈ కుంభకోణంపై విజిలెన్స్ విచారణ చేపడితే నిజాలు బయట పడతాయని తెలుస్తోంది. ఎంజీఎం కొత్త బాస్ దీనిపై దృష్టి పెడితే బాగుంటుందని రోగులు అంటున్నారు. ఇటీవల కాలంలో సెక్యూరిటీ గార్డులు కూడా రోగులపై దాష్టీకాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెక్యూరిటీ గార్డులు పై అండదండలు తీసుకొని ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని విమర్శలున్నాయి.. కొత్త బాస్ సెక్యూరిటీ గార్డుల వ్యవహార శైలి పట్ల దృష్టి సారించాలని.. వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు. వైద్య సేవల విషయంలో పారదర్శకతను పెంపొందించాలని కోరుతున్నారు.

# పదవీ విరమణ పొందిన కార్మికుని ఈ ఘన సన్మానం



కమాన్ పూర్: పదవీ విరమణ పొందిన సింగరేణి కార్మికునికి ఘన సన్మానం నిర్వహించారు. మోతుకూరి వెంకటేశ్వర్లు ఇ పి ఎలెక్ట్రిషన్ ఆర్.జి త్రీ పరిధిలోని ఓసిపి- 2,సింగరేణి కంపనీ లో సుదీర్ఘంగా 35 సంవత్సరాలు కార్మికునిగా పనిచేశారు. యాజమాన్యం ఆదేశాల మేరకు క్రమశిక్షణ, అంకిత భావంతో పని చేసి సింగరేణి కంపని అభివృద్ధి లో భాగస్వాములు కావడం జరిగింది. కాలి సమయములో తోటి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సేవా చేయడమే కాకుండ ఆధ్యాత్మికగా కూడా అనేక కార్యక్రమాలలో పాల్గొని అధికారులు,కార్మికులు మరియు సహచర సమీప కుటుంబాల మన్ననలు పొంది పదవీవిరమణ పొందారు. ఈ సందర్భంగా సింగరేణి ఆల్ రిటైర్మెంట్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గౌతం శంకరయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోతుకూరి వెంకటేశ్వర్లు భార్య పిల్లలతో కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆయన ఆ భగవంతుని వేడుకోవడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో సింగరేణి ఆల్ రిటైర్మెంట్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యకులు అధ్యక్షుడు వేగోలపు మల్లయ్య జాయింట్ సెక్రటరీ తోట మొండయ్య జనరల్ సెక్రటరీ పట్నం సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఒరుగులు.. పొడులు.. కోటి దాటి పరుగులు..



చిన్నప్పటి నుంచి ఆమె చదువుల్లో నేర్పరి. నిరంతరం పుస్తకాలతో దోస్తీ చేస్తూనే%ౌ% తన తండ్రి పడే కష్టాన్నీ గమనించింది. పండిన టమాటాలను ధర లేక పొలంలోనే వదిలేసిన తల్లిదండ్రుల దైన్యాన్నీ చూసింది. ఆ కష్టాలను మనసులోనే దాచుకొని.. ఉన్నతంగా చదువుకుంది. కార్పొరేట్ కొలువు సాధించింది. కానీ, ఆమెకు కావాల్సింది ఇది కాదు. అందుకే, ఉద్యోగాన్ని వదిలేసి స్టార్టప్ ప్రారంభించింది సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన ఓడపల్లి కీర్తిప్రియ. 2018లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పి.. కాయగూరలతో ఒరుగులు, పొడులు తయారు చేయడం మొదలుపెట్టింది. స్థానిక రైతులకు గిట్టుబాటు ధర ఇస్తూ, వినియోగదారులకు సేంద్రియ ఉత్పత్తులను అందిస్తున్న 'కోహ ఫుడ్స్' వ్యవస్థాపకురాలు కీర్తిప్రియ సక్సెస్ స్టోరీ ఇది..

కీర్తి ప్రియది సాధారణ మధ్యతరగతి కుటుంబం. ఆమె తండ్రి వెంకన్న కానిస్టేబుల్‌గా పనిచేసేవారు. సొంతూరులో ఆరెకరాల సాగుభూమిలో వ్యవసాయం చేసేవారు. వరితోపాటు కూరగాయలు వేసేవారు. కీర్తి తల్లి విజయలక్ష్మి వ్యవసాయం చూసుకునేది. కీర్తి కోదాడ, వరంగల్‌లో ఇంటర్ వరకు చదివింది. తర్వాత బిట్స్ పిలానీలో బీఫార్మసీ,ఐఐఎం కోల్‌కతాలో ఎంబీఏ పూర్తి చేసింది. మంచి ప్యాకేజీతో కార్పొరేట్ ఉద్యోగం సాధించింది.



మంచి ఉద్యోగం లభించినా.. తాను కోరుకున్న జీవితం ఇది కాదు అనిపించింది ఆమెకు. చిన్నప్పుడు సాగులో తన తండ్రికి ఎదురైన చేదు అనుభవాలు ఆమెను కుదురుగా ఉండనివ్వలేదు. టమాటాలకు ధర లేక కోత కోయకుండానే వదిలేసిన తండ్రి దుఃఖం ఆమెను వెంటాడింది. తాను చదువుకునే రోజుల్లో తల్లి పంపించిన ఒరుగులు, పొడులను గుర్తు చేసుకుంటూ వాటినే ఎందుకు తయారు చేయకూడదని ఆలోచన చేసింది. దాన్ని అమలు చేయడానికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించింది కీర్తి.




కల సాకారం..: ఎంబీఏ చదివిన కీర్తికి వ్యాపార మెలకువలు కొట్టిన పిండి. ఆ ధైర్యంతోనే చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి 2018లో ఈ వ్యాపారం మొదలుపెట్టింది. తొలుత లక్ష రూపాయల వ్యయంతో సోలార్ డ్రయర్ కొనుగోలు చేసింది. తొలినాళ్లలో ఒడుదొడుకులు ఎదురైనా కుటుంబం సహకారంతో నిలబడింది. అంచెలంచెలుగా ఎదిగి 2021లో నట్స్ అండ్ ఫీల్డ్స్ ఇండస్ట్రీ ఏర్పాటు చేసింది. 2022లో 'కోహ ఫుడ్స్' సంస్థను స్థాపించి సేంద్రియ పద్ధతుల్లో పండించిన రకరకాల పంటలతో ఒరుగులు, పొడులు, టీ పొడి తయారు చేస్తూ.. తన కలను సాకారం చేసుకున్నది.

మహిళలకు ఉపాధి: తొండ గ్రామానికి పదిహేను కిలోమీటర్ల పరిధిలోని రైతులను కలిసి ఎలాంటి ఎరువులు, మందులు వేయకుండా కూరగాయలు, ఆకు కూరలు సాగు చేసేలా ప్రోత్సహించింది కీర్తి. అలా రైతులు సాగు చేసిన పంటను బహిరంగ మార్కెట్ కన్నా ఎక్కువ ధర ఇచ్చి కొనుగోలు చేస్తుంది.

టమాటాలు, బీట్‌రూట్, క్యారెట్, బెండకాయలు, మునగ, పాలకూర ఇలా 15 రకాలను సేకరించి, వాటిని ఒరుగులుగా, పొడులుగా తయారు చేసి 'కోహ ఫుడ్స్' బ్రాండ్ పేరుతో విక్రయిస్తున్నది. అరటి పూతతో టీ పొడి తయారు చేస్తున్నది. కీర్తిప్రియ తన స్టార్టప్‌తో రైతులకు మేలు చేయడంతోపాటు 25 మంది మహిళలకు ప్రత్యక్షంగా ఉపాధి కల్పించింది.

ఎప్పట్నుంచో ఉన్నదే..: '2022లో 'కోహ ఫుడ్స్' ప్రొడక్షన్ ప్రారంభించాను. 20 లక్షల టర్నోవర్‌తో మొదలైన మా ప్రయాణం ఇప్పుడు కోటి రూపాయలకు చేరింది. ఈ ఏడాది రెండు కోట్లు టార్గెట్ పెట్టుకున్నాను. ఇది నా సొంత ఆలోచన కాదు. ఇప్పుడు మనం మర్చిపోయాం కానీ, సీజనల్ కాయగూరలతో ఒరుగులు పెట్టడం ఒకప్పుడు ఇంటింటా కనిపించేది.



# ఇన్‌కమింగ్ కాల్స్‌లో పేరు డిస్‌ప్లే

## త్వరలో ప్రవేశపెట్టనున్న ట్రాయ్

న్యూఢిల్లీ, : మన మొబైల్‌కు ఎవరు ఫోన్ చేస్తున్నారో తెలుసుకోవాలంటే ట్రూ కాలర్ లాంటి థర్డ్ పార్టీ యాప్‌లపై ఆధారపడుతున్నాం. ఇకపై అలాంటి అవసరం లేకుండా, ఫోన్ కనెక్షన్ సమయంలో ఇచ్చిన ఐడీలోని పేరు ఇన్‌కమింగ్ కాల్స్ సమయంలో మొబైల్ స్క్రీన్‌పై కనిపించే సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ మేరకు టెలికమ్యూ నికేషన్స్ శాఖ అందించిన ప్రతిపాదనలను టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ఆమోదం తెలిపింది. వచ్చే ఏడాది మార్చి నాటికి ఇది అందుబాటులోకి రానుంది. కాలింగ్ నేమ్ ప్రెజెం టేషన్ (సీఎన్‌ఏపీ)గా పేర్కొనే ఈ సర్వీస్ ద్వారా ఇకపై వినియోగ దారులు తమకు వచ్చే కాల్స్‌లో పారదర్శకత పొందుతారు. మనకు కాల్ చేసే వ్యక్తి ఆయా టెలికం ఆపరేటర్ వద్ద ఏ పేరుతో అయితే సిమ్ తీసుకున్నాడో ఆ పేరు మాత్రమే మనకు డిస్‌ప్లే అవుతుంది. దీని ద్వారా స్పామ్ కాల్స్ బెడద తప్పుతుంది. సీబీఐ, ఐటీ, పోలీస్, సీఐడీ వంటి పేర్లతో మోసపుచ్చే అవకాశం ఉండదు. వినియోగ దారులకు ఈ ఫీచర్ డిఫాల్ట్‌గా ప్రారంభమవుతుంది.

# సినిమా

## నవ్వించేందుకు మళ్లీ వస్తున్నారు



విశ్వక్‌సేన్ కథానాయకుడిగా తరుణ్‌భాస్కర్ దర్శకత్వంలో ఎనిమిదేండ్ల క్రితం వచ్చిన 'ఈ నగరానికి ఏమైంది' సినిమా ఎంతటి విజయాన్ని అందుకున్నదో తెలిసిందే. కల్ట్ కామెడీ మూవీగా ఆడియన్స్‌ని నుంచి కితాబులందుకున్న ఈ చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న సినిమా 'ఈఎన్ఈ రిపీట్'. విశ్వక్‌సేన్, అభినవ్ గోమటం, వెంకటేశ్ కాకుమాను, శ్రీనాథ్ మాగంటి కలిసి నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి నిర్మాతలు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ థాయిలాండ్‌లో జరుగుతున్నది. నెలరోజుల పాటు ఈ షెడ్యూల్ సాగుతుందని మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన స్టిల్‌లో వింటేజ్ కన్వర్టిబుల్ కారులో హాయిగా కూర్చుని, ఎంతో ఉత్సాహం కనిపిస్తున్న విశ్వక్, అభినవ్ గోమటం, వెంకటేశ్ కాకుమానులను చూడొచ్చు.ఈ చిత్రానికి కెమెరా: ఏజే ఆరోల్, సంగీతం: వివేక్ సాగర్.

## సమీరా రెడ్డి గ్రాండ్ రీ-ఎంట్రీకి సిద్ధం...



ఒకప్పుడు టాలీవుడ్‌లో గ్లామర్, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నటి సమీరా రెడ్డి మళ్లీ వెండితెరపై మెరిపించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సుదీర్ఘ విరామం తర్వాత ఆమె రీ-ఎంట్రీపై వస్తున్న వార్తలు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మెగాస్టార్ చిరంజీవి, యంగ్ టైగర్ ఎన్టీఆర్ వంటి అగ్ర హీరోల సరసన నటించి మంచి గుర్తింపు పొందిన సమీరా, పెళ్లి తర్వాత సినిమాలకు దూరమైంది. అయితే ఇప్పుడు మళ్లీ సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు ఓ క్రేజీ ప్రాజెక్ట్‌ను ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఓ స్టార్ హీరో సినిమాలో సమీరా రెడ్డి కీలకమైన పాత్రలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు పూర్తయ్యాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి.గతంలో కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్‌గా అలరించిన సమీరా, ఇప్పుడు తన వయస్సు, అనుభవానికి తగిన ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. పేరు కోసం కాకుండా, కథలో బలం ఉన్న పాత్రలకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. సినిమాలకు దూరంగా ఉన్న సమయంలో కూడా సమీరా రెడ్డి అభిమానులతో టచ్‌లోనే ఉంది. బాడీ పాజిటివిటీ, మాతృత్వం, ఫిట్‌నెస్ వంటి అంశాలపై ఆమె పంచుకున్న వీడియోలు నెటిజన్లను ఆకట్టుకున్నాయి. సెలబ్రిటీ హోదాను పక్కన పెట్టి తన వ్యక్తిగత అనుభవాలను నిజాయితీగా పంచుకోవడంతో ఆమెకు సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఇప్పటికే పలువురు సీనియర్ హీరోయిన్లు సెకండ్ ఇన్నింగ్స్‌లో సక్సెస్ సాధిస్తున్న నేపథ్యంలో, సమీరా రీ-ఎంట్రీపై కూడా అంచనాలు పెరిగాయి. ఈ సినిమా ఆమె కెరీర్‌లో ఒక మలుపుగా నిలుస్తుందని భావిస్తున్నారు. అయితే ఆమె నటిస్తున్న ఆ స్టార్ హీరో సినిమా ఏది? అందులో ఆమె పాత్ర ఎలా ఉండబోతోంది? వంటి వివరాలు త్వరలోనే అధికారికంగా వెలువడనున్నాయి. మొత్తానికి, సమీరా రెడ్డి రాకతో టాలీవుడ్‌లో సీనియర్ నటీమణుల హవా మరింత పెరగనుందని అభిమానులు ఆశిస్తున్నారు.

## చిరుతో బాబీ సినిమా.. నెగెటివ్ రోల్‌లో డింపుల్ హయతి

టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద 'వాల్తేరు వీరయ్య'తో మ్యాజిక్ చేసిన మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి మళ్ళీ చేతులు కలిపారు. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులను ముగించుకుని షూటింగ్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటికే మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, బాలీవుడ్ నటుడు అనురాగ్ కశ్యప్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. ఇక ఈ సినిమాలో చిరు సరసన ప్రియమణి హీరోయిన్‌గా నటించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా, ఈ చిత్రానికి సంబంధించి తాజాగా వినిపిస్తున్న ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది.

ఈ సినిమాలో ఒక కీలక పాత్ర కోసం బోల్డ్ బ్యూటీ డింపుల్ హయాతిని ఎంపిక చేసినట్లు సమాచారం. సాధారణంగా డింపుల్ హయాతి అంటే గ్లామర్ పాత్రలకు కేరాఫ్ అడ్రస్. కానీ బాబీ ఈ సినిమాలో ఆమెను సరికొత్తగా చూపించబోతున్నారట. ఇందులో ఆమె హీరోయిన్ కాదు అని, నెగిటివ్ షేడ్స్ ఉన్న ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తుందని తెలుస్తోంది. మెగాస్టార్ వంటి దిగ్గజ నటుడికి ఎదురు నిలిచే పాత్ర కావడంతో డింపుల్ రోల్ చాలా ఇంటెన్సివ్‌గా ఉండబోతోందట. ఈ డిఫరెంట్ కాస్టింగ్ సినిమాకు పెద్ద ప్లస్ అవుతుందని ఫిలిం నగర్ వర్గాలు భావిస్తున్నాయి. కమెగాస్టార్ ఒక సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారని, బాబీ ఈ పాత్రను చాలా స్టైలిష్‌గా డిజైన్ చేశారని టాక్.



## నా జుట్టు మెరుపు వెనుక ఉన్న రహస్యం ఇదే... శ్రేయా ఘోషాల్



ప్రముఖ గాయని శ్రేయా ఘోషాల్ తన పొడవైన, నిగనిగలాడే జుట్టు వెనుక ఉన్న రహస్యాన్ని అభిమానులతో పంచుకున్నారు. లండన్‌లో బ్రిటిష్ వోగ్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో, తన జుట్టు అందానికి కారణంఒక సాధారణ భారతీయ చిట్కాఅయిన 'కొబ్బరి నూనె' అని ఆమె వెల్లడించారు. ఈ సింపుల్ సమాధానం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌అవుతోంది. కన్సర్ట్ టూర్‌లో భాగంగా లండన్ వెళ్లిన శ్రేయా, అక్కడి ప్రతిష్ఠాత్మక ఓ2 ఎరీనాలో హౌస్‌ఫుల్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓఇంటర్వ్యూలో, "మీ జుట్టు ఇంత అందంగా, మెరిసిపోతూ ఎలా ఉంటుంది?" అని అడిగిన ప్రశ్నకు ఆమె బదులిస్తూ "ఇండియన్ చిట్కా...కొబ్బరి నూనె" అనినవ్వుతూ చెప్పారు. ఈ కచేరీలో ఆమె పొడవైన జుట్టుతో ప్రత్యేకంగా కనిపించ గా, ఆ లుక్‌పై అభిమానులు ప్రశంసలు కురిపించారు. ఇదే వేదికపై ఆమె లెజెండరీ సింగర్ ఆశా భోస్లేకునివాళి అర్పించారు.ఆశా ఆలపిం చిన "దమ్ మారో దమ్", "అభీ నా జావో ఛోడ్ కర్" వంటి క్లాసిక్ పాటలను పాడి ఆమె సంగీత సేవలను గుర్తుచేసుకున్నారు. ఒక అంతర్జాతీయ స్టార్‌గా ఉండి కూడా శ్రేయా ఘోషల్ తన మూలాలను మర్చిపోకుండా, భారతీయ సంప్రదాయ పద్ధతులనే అనుసరించడం ఆమె సరళతను తెలియజేస్తోందని పలువురు ప్రశంసిస్తున్నారు.

## పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ ట్రెండ్‌లోకి మరో బ్యూటీ!



ఈ మధ్యకాలంలో బాగా వార్తలలో నిలుస్తోన్న అంశం.. సెలబ్రిటీల 'పెయిడ్ సబ్‌స్క్రిప్షన్స్'. సోషల్ మీడియా అకౌంట్స్‌లో ఫాలోయర్స్‌ని పెంచుకుంటూ, వారికి అందాల ఎర వేస్తూ, సబ్‌స్క్రిప్షన్ వైపు నడిపించుకుంటున్నారు. కాస్త పేరున్న భామలందరూ ఇప్పుడీ బాటలోనే నడిచేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే విష్ణు ప్రియ, అనన్య నాగళ్ల వంటి నటీమణులు ఈ పద్ధతి ద్వారా తమ సోషల్ మీడియా క్రేజ్‌ని, ఆదాయ మార్గంగా మార్చుకోగా.. ఇప్పుడు మరో సోషల్ మీడియా స్టార్ అషు రెడ్డి, కూడా అదే బాటలో పయనిస్తున్నారు. తాజాగా ఆమె కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో 'పెయిడ్ సబ్‌స్క్రిప్షన్స్' ట్రెండ్‌లోకి అడుగుపెట్టినట్లుగా చెబుతూ ఓ వీడియోను షేర్ చేశారు. ఇప్పుడా వీడియో వైరల్ అవుతోంది. నటిగా, బిగ్ బాస్ ఫేమ్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉన్న ఈ బ్యూటీ, తన ఫాలోయర్స్ కోసం నెలకు రూ. 399 రుసుముతో ఎక్స్‌క్లూజివ్ కంటెంట్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లుగా ఈ వీడియోలో నవ్వుతూ తెలుపుతున్నారు. ప్రస్తుతం ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో రెండు మిలియన్లకు పైగా ఫాలోయర్స్ ఉన్నారు. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ, తాజా ఫొటో షూట్స్‌తో సందడి చేసే అషు రెడ్డి, తన పాపులారిటీని క్యాష్ చేసుకునే ప్రయత్నంలో సక్సెస్ అయ్యారు. సబ్‌స్క్రిప్షన్ ఫీచర్‌ను లాంచ్ చేసిన ఒక్క రోజులోనే ఆమెకు దాదాపు 700 మందికి పైగా సబ్‌స్క్రైబర్లు చేరడం విశేషం. ఈ లెక్కన చూస్తే, కేవలం ఒక్క రోజులోనే దాదాపు రూ. 3 లక్షల ఆదాయాన్ని సునాయాసంగా అందుకున్నారని తెలుస్తోంది. రానున్న రోజుల్లో ఈ సబ్‌స్క్రైబర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే అమ్మడి పరువాల పవర్ అలాంటిది మరి.రామ్ గోపాల్ వర్మకే మతిపోగొట్టిన అందం అషు రెడ్డి సొంతం. అలాంటి భామ అందరికీ పరువాల విందు ఇస్తానంటే, పైకం చెల్లించకుండా ఉండగలరా? అందుకే, సబ్‌స్క్రైబర్ అయ్యేందుకు క్యూ కడుతున్నారు. తెలుగు సినిమాల్లో కొన్ని పాత్రలతో మెరిసినప్పటికీ, అషు రెడ్డికి సోషల్ మీడియాలో ఉన్న క్రేజ్ అసాధారణమని చెప్పొచ్చు. ముఖ్యంగా ఆమె షేర్ చేసే గ్లామరస్ ఫోటోషూట్స్, వీడియోలకు యూత్ నుండి భారీ స్థాయిలో ఆదరణ లభిస్తుంటుంది. తనకంటూ ఉన్న ఈ బలమైన ఫాలోయింగ్‌ను, అభిమానులకు ఇలా సబ్‌స్క్రిప్షన్ పేరిట కొత్త ఆదాయ వనరుగా మార్చుకుంటోంది. ప్రస్తుతం ఈ అంశంపైనే భారీ స్థాయిలో చర్చలు నడుస్తున్నాయి. ఈ సబ్‌స్క్రిప్షన్ విషయమై పోలీసులకు కూడా ఫిర్యాదులు అందుతున్నట్లుగా తెలుస్తోంది. ఆల్రెడీ విష్ణు ప్రియపై కేసు కూడా నమోదైంది. మరి, ఈ విధానానికి అంతం, అదుపు.. ఏ రూపంలో ఉంటుందనేది తెలియాలంటే మాత్రం వేచి చూడాల్సిందే.

## యాక్షన్ మోడ్‌లో రౌడీ జనార్ధన



శ్రీకాకుళం నేపథ్యంతో కూడిన 80వ దశకపు పొలిటికల్ యాక్షన్ డ్రామా 'రౌడీ జనార్ధన'. అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో కీర్తిసురేశ్ కథానాయిక. రవికిరణ్ కోలా దర్శకుడు. దిల్‌రాజు నిర్మాత. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఇటీవల విడుదల చేసిన గ్లింప్స్‌లో విజయ్ దేవరకొండ మేకోవర్, ఆయన సంభాషణలు పలికిన తీరు, అభిమానుల్నీ, సినీ ప్రేమికులను విశేషంగా ఆకట్టుకున్నది. ఈ గ్లింప్స్ సినిమాపై అంచనాలను కూడా పెంచింది. దిల్‌రాజు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మే చివరివారం హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో ఈ సినిమాకు సంబంధించిన కొత్త షెడ్యూల్ మొదలుకానున్నది. ఈ షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు ఓ పాటను కూడా చిత్రీకరిస్తారు. ఇదిలావుంటే.. ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఈ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని ఇన్‌సైడ్ టాక్.

ఈ ఎపిసోడ్‌లో విజయ్ పూర్తి యాక్షన్ మోడ్‌లో కనిపిస్తారట. మునుపెన్నడూ లేనంతగా ఊరమాస్ పాత్రలో విజయ్ నటిస్తుండటంతో ఈ సినిమా అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. షూటింగ్ పూర్తి చేసి, ఈ ఏడాది చివర్లో సినిమాను విడుదల చేయనున్నారు.

Printer, Published and Owned by AMBATI PUBLICATIONS at H.No. 8-3-214, Mallikarjun Nagar, Godavarikhani, Dist. Peddapalli. Telangana State - 505 209.“
Printers : Ganesh Offset Printers, Godavarikhani. Editor: P. Ramakrishna, RNI No. TELTEL/2021/02031, email : yadavpolaveni123456@gmail.com, Mobile : 7396644411